

ప్లాస్టిక్ నిషేధం

- అమ్రాబాద్ అభయారణ్యంలో కఠిన నిబంధనలు
- పెద్ద పులులు, ఇతర వన్యప్రాణులకు హాని కలుగకుండా చర్యలు
- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న అటవీశాఖ



మన్ననూర్, జూన్ 6: అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని క్రమేపీ తగ్గించడంపై అటవీ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించి, పలురకాల పర్యావరణ హిత కార్యక్రమాలను చేపడుతోంది. నల్లమల పులుల అభయారణ్య ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధించేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా జీవో జారీ చేశారు. ఆ ఆదేశాలను అమలు చేసేందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు.

ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు హాని..

అభయారణ్య ప్రాంతం 2,166 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. అడవిలో 25 పెద్ద పులులు, 170 చిరుత పులులు, జింకలు, సాంబర్లు, మనుబోతు, అడవి పందులు, నెమళ్లు, మూషిక జింకలు, అడవి కోళ్లు, అడవి కుక్కలు, అడవిపిల్లి, ఎలుగుబంట్లు కలిపి 2000 లకు పైగా ఉన్నట్లు అటవీశాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇటీవల పెద్ద పులులు, చిరుతల సంఖ్య పెరిగింది. పెద్ద పులులకు ఆహారం కోసం సరిపడా జంతువుల సంఖ్య ఉందా?.. లేకుంటే ఎంత మేర పెంచాలో తెలుసుకునేందుకు మే నెలలో మూడు రోజుల పాటు అన్ని బీట్లలో ఎకలాజికల్ సర్వే చేపట్టారు. ప్లాస్టిక్ వలన వన్యప్రాణులకు ఎంతో ప్రాణహాని ఉందని అటవీ అధికారులు గుర్తించారు. అడవి గుండా ఉన్న రహదారులు దాటే క్రమంలో పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువులను, నీళ్ల సీసాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వదిలివేయడం వలన శాకాహార జంతువులైన జింకలు, సాంబారు, కణితి వంటివి వాటిని తినడం వల్ల జీర్ణకోశ సమస్యలు వచ్చి.. ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు గుర్తించారు. అందుకే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

అమ్రాబాద్ అడవుల్లో ప్లాస్టిక్ నిషేధానికి ఇప్పటికే పలు రకాల కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, మద్దిమడుగు, దోమలపెంట వరకు రహదారులపై పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర తినుబండారాల కవర్లను వదిలి వెళ్తున్నారు. వాటిని నిత్యం ఒక దగ్గరికి చేర్చేందుకు అటవీ శాఖ స్థానికంగా ఉండే ఎనిమిది మంది సిబ్బందిని నియమించింది. ఈ వ్యర్థాలను మన్ననూరు వద్ద ఉన్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రానికి చేర్చుతారు. అక్కడి సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి, రీసైక్లింగ్ యంత్రంలో వేసిన తర్వాత కట్టలు కట్టి, హైదరాబాద్‌లోని సెంటర్‌కు తరలిస్తారు. ఈ సిబ్బంది వేతనాల కోసం ఎనిమిదేళ్లుగా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద అటవీశాఖ టోల్‌గేట్లను ఏర్పాటు చేసింది. పర్యాటకుల వాహనాల నుంచి మెయింటెనెన్స్ చార్జీల రూపేణ టోల్ ఫీజులను వసూలు చేసి, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా జనపనార సంచులు, పర్సులు, కూరగాయల బ్యాగులు, అడవిలో లభించే మార్పటాకులతో పర్యావరణహిత టిఫిన్, భోజనం ప్లేట్ల తయారీ కేంద్రాన్ని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ నిర్వహిస్తోంది. సఫారీ టూర్‌కు వచ్చిన పర్యాటకులకు ఈ పర్యావరణ హిత వస్తువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. ముందు ముందు పావు, అర లీటరు ప్లాస్టిక్ నీటి బాటిళ్లు మన్ననూరు నుంచి తీసుకెళ్లకుండా నిషేధం విధించి, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ఉన్నతాధికారులతో సమాలోచనలు చేస్తున్నారు.



రీసైక్లింగ్ కేంద్రంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వాడకం తగ్గేలా చర్యలు



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు నల్లమలలో జూలై ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధంపై కఠిన నిబంధనలు విధించనున్నాం. ప్లాస్టిక్ సీసాలతో పాటు తినుబండారాల కవర్లను అడవిలో వదలకుండా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టు వద్ద పర్యటకులకు అవగాహన కల్పిస్తాం. మన్ననూరు, మద్దిమడుగు, వటవర్లపల్లి, దోమలపెంట తదితర గ్రామాల్లోని హోటళ్లు, దాబాలు, దుకాణాల యజమానులకు సైతం ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కల్పిస్తాం. పర్యావరణహిత ప్లేట్లు, కప్పులను ఉమామహేశ్వరం, మద్దిమడుగు, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రసాదాల పంపిణీకి వాడేలా చర్యలు చేపడతాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో ఉపాధి



ప్లాస్టిక్ వ్యర్థాలైన బాటిళ్లు, కవర్లు, సీసాలు రహదారి పొడవునా సేకరిం చి మన్ననూరులోని రీసైక్లింగ్ కేంద్రానికి తరలిస్తున్నాం. ఆ కేంద్రంలో యంత్రాల ద్వారా 10 కిలోలకుపైగా బరువు ఉండేలా వ్యర్థాలను కట్టలు కట్టి, హైదరాబాద్‌లోని కేంద్రానికి తరలిస్తున్నాం. అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ రహిత కార్యక్రమాల వల్ల ఎనిమిది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

- సతీష్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రం నిర్వాహకుడు



మన్ననూరులోని పర్యావరణ హిత టోల్‌గేట్ (అటవీ చెక్‌పోస్టు)



అడవిలో ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తున్న అటవీశాఖ వలంటీర్లు



అలంపూర్ : ప్రభుత్వ కళాశాల చుట్టూ నిలిచిన వరద నీరు

స్తంభించిన జనజీవనం

- భారీ వర్షానికి జలమయమైన రోడ్లు, కాలనీలు
- పిడుగుపాటుకు మహిళ మృతి



పాలమూరులో మినీ ట్యాంక్‌బండ్ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మహబూబ్‌నగర్/అలంపూరు/వెల్దండ/ ఉప్పునుంతల, జూన్ 6 : ఉమ్మడి పాలమూరు జిల్లాను వర్షం ముంచెత్తింది. గురువారం మధ్యాహ్నం కురిసిన వానకు పాలమూరులో జనజీవనం స్తంభించిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. వాతావరణం మేఘావృతమవడంతో చీకటి అలుముకున్నది. మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. బుధవారం రాత్రి, గురువారం కురిసిన వానతో మినీ ట్యాంక్‌బండ్ రహదారి వర్షపు నీటితో నిండి నీరు ఫుట్‌పాత్‌పైకి చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. అలంపూరు పట్టణంలో అక్బర్ పేట కాలనీలో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివాముల చుట్టూ నిలిచాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ నీరు చేరడంతో దీవిని తలపించింది. కళాశాల ప్రాంగణం పూర్తిగా జలమయమైంది.



ఉప్పునుంతలలో పిడుగు పడి మృతి చెందిన ఎద్దు

వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గురువారం పిడుగుపాటుకు గురై కొమ్మరెక్క జంగమ్మ (45) మృతి చెందగా, ఆమె భర్త కృష్ణయ్య గాయపడ్డాడు. కృష్ణయ్య తన భార్య జంగమ్మ, అత్త జంగిలి ఈదమ్మతో కలిసి తన వ్యవసాయ పొలంలో పత్తిగింజలు నాటుతుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో జంగమ్మ అక్కడికక్కడే మృతిచెందగా భర్త కృష్ణయ్య గాయపడ్డాడు. అత్త తృటిలో ప్రాణాపాయంనుంచి తప్పించుకుంది. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కృష్ణయ్యను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఉప్పునుంతలలో సూరం రాజేందర్‌రెడ్డి బుధవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద ఎద్దును కట్టేశారు. రాత్రి కురిసిన గాలి వానలలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల విలువ ఉంటుందని బాధితుడు వాపోయాడు.



అలంపూర్ : అక్బర్ పేటలో ఇంట్లోకి చేరిన వరద నీరు

అలంపూరులో ఎత్తిపోయని మోటార్లు..

ఎత్తిపోతల ద్వారా వరద నీరు, మురుగు నీటిని ఎత్తి పోసే మోటార్లు పనిచేయకపోవడంతో వీధులలో నీరు నిలుస్తోందని, ఇళ్లలోకి నీరు చేరుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వివరించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలను దృష్టిలో ఉంచుకుని త్వరగా పరిష్కరించాలని చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



అలంపూర్ : ఎత్తిపోతల మోటార్ల వద్ద నిండిన వరద నీరు

అతివేగంతో ప్రాణాలకు ముప్పు

- నారాయణపేట జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- 2019 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 877 యాక్సిడెంట్లు
- 498 మంది మృతి.. 828 మందికి గాయాలు



మక్తల్‌లో కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)

నారాయణపేట, జూన్ 6: నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. అతి వేగంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకుగురై ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2019 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వరకు 877 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 498 మంది మరణించారు. 828 మంది గాయపడ్డారు. ఇటీవల మక్తల్ శివారులో కర్ణాటక బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం, అతి వేగం వల్ల ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిశాయి. ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు జాగ్రత్తలపై ప్రజలకు ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారి 56 కిలో మీటర్ల మేర ఉంది. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాస్‌ను గుర్తించారు. మరికల్ సర్కిల్‌లో తొమ్మిది, మక్తల్‌లో 18 ఇలా మొత్తం 27 గుర్తించారు. ఆయా చోట్ల అధికారులతో రోడ్ సైన్ బోర్డ్స్ బారికేడ్లు, స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయించారు. అతివేగం నియంత్రణ కోసం జాతీయ రహదారిపై మరికల్, రాయిచూర్ వద్ద స్పీడ్‌గన్‌లను ఏర్పాటు చేశారు. వాటిద్వారా వాహనాలు వేగం 80 కిలో మీటర్లు దాటితే ఆటోమెటిక్‌గా జరిమానా పడుతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ తదితర కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్‌ఐలు, కళాబృందాలు, పీటీమ్స్ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. రహదారులపై వాహనదారులు వాహనాలను అనవసరంగా ఆపినా, అనుకోకుండా రోడ్డుపై ఆగిపోయినా, వాటి వెనుక స్టిక్కర్లు, గుర్తులు అతికించుకోకుండా ఇతరుల రోడ్డు ప్రమాదాలకు, మరణాలకు కారణమైతే చట్టం ప్రకారం వాహనదారులకు పదేళ్ల జైలు శిక్ష పడుతుందని చెబుతున్నారు.

జిల్లాలో జరిగిన ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2019	161	70	195
2020	163	88	166
2021	135	90	137
2022	156	106	139
2023	185	102	132
2024	77	42	59

ఇసుక మాఫియా

- అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా
- ఒక టిప్పర్‌కు అనుమతితో పదుల సంఖ్యలో తరలింపు
- దుందుభీ నుంచి రోజుకు 30 నుంచి 50 టిప్పర్లలో తరలుతున్న ఇసుక
- ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నా పట్టించుకోని అధికారులు



డంప్ చేసిన ఇసుకను హిటాచీ ద్వారా టిప్పర్‌లోకి నింపుతున్న వ్యాపారులు



పొల్మూరు వద్ద నిల్వ చేసిన ఇసుక

నాగర్‌కర్నూల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నది పరివాహక ప్రాంతంలో కంటికి రెప్పలా కాపాడుకున్న ఇసుక మేటలను కళ్ల ఎదుటే కొల్లగొడుతుంటే నిలువరించలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లడం పరివాహక ప్రాంత ప్రజలను కలవరపెడుతున్నది. అనుమతుల పేరిట ఇసుక దోపిడీ కొనసాగుతుండడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. రోజుకు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మౌనం దాల్చడం వెనక అంతర్యమేమిటో బోధపడడం లేదు. తాడూరు మండలం మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లి ప్రాంతాల్లో రోజుకు టిప్పర్లల్లో ఇసుక దోపిడీ కొనసాగుతున్నది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్న దుందుభీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలివెళ్తున్నా ఎవరూ పట్టించుకునే పాపాన పోవడం లేదంటూ పొల్మూరు, మేడిపూర్ గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇసుక లోడ్‌తో టిప్పర్లు తిరగడంతో పగిలిపోయిన బీటీ రోడ్డు

మైనింగ్ ఆదాయానికి గండి

ఇసుక అక్రమ రవాణాతో మైనింగ్ శాఖ లక్షల రూపాయలు నష్టపోతున్నా అధికారులు నోరు మెదపకపోవడం వెనుక అంతర్యమేమిటో బోధపడడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శ్యాండ్ టాక్సీ వాహనాలు నడపవల్సి ఉంటుంది. ఇసుక ఎవరికి అవసరం ఉంటే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ ద్వారా అనుమతి పొందాలి. అనుమతి పొందిన పత్రంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న అధికారికి అనుమతి పత్రం చూపించి ఇసుకను ట్రాక్టర్లలో తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం పొల్మూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్ద భిన్నమైన పరిస్థితి కన్పిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారు ఇసుకను అక్రమంగా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దుందుభీ నదిలోకి ప్రత్యేకంగా రోడ్లు వేసి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దుందుభీ నదిలో నుంచి బయటకు ప్రతీరోజు భారీ టిప్పర్లలో దాదాపు 500 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా రవాణా అవుతుంది. జిల్లాలోనే కాక జిల్లా సరిహద్దులను కూడా దాటిస్తున్నట్లు సమాచారం. దుందుభీ పరివాహక ప్రాంతంలో కల్వకుర్తి మండలం గుండూరు, లింగసానిపల్లితో పాటుగా తాడూరు మండలంలోని మేడిపూర్, పొల్మూరు గ్రామాల్లో ఇసుక డంప్‌లు ఉన్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఉప్పునుంతల మండలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

జాతీయ రహదారి పేరిట కొనసాగుతున్న అక్రమాలు

మేడిపూర్ గ్రామం వద్ద కల్వకుర్తి నంద్యాల జాతీయరహదారికి సంబంధించి దుందుభీ నది వద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులకు ఇసుక అవసరం ఉన్న సందర్భంలో ప్రభుత్వం వాడుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇదే ఇసుక దోపిడీ దారులకు వరంగా మారింది. దీనిని సాకుగా చూపి రాత్రి పగలు తేడా లేకుండా తోడేళ్లలా ఇసుకను తోడేస్తున్నారు. కొన్నిసార్లు గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. అదేవిధంగా దుందుభీ నది పరివాహక ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా వాహనాలు చక్కర్లు కొడుతుండడంతో మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లి ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. భారీ టిప్పర్లను మైనర్లు నడుపుతున్నప్పటికీ రోడ్డు రవాణా శాఖకు చెందిన అధికారులు మౌనంగా ఉండటం విశేషం.

ఎద్దుల బండిని ఢీ కొట్టిన బైక్

- యువకుడి మృతి



రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

తాడూరు, జూన్ 6 : ప్రమాదవశాత్తు పొలం పక్కలో ఆగి ఉన్న ఎద్దుల బండిని మోటారు సైకిల్‌తో ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఐతోల్ గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి (30) ఫైనాన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఐతోల్ గ్రామం నుంచి మాదారం మీదుగా కల్వకుర్తి వైపు వెళ్తున్న క్రమంలో సిర్సవాడ మాదారం గ్రామాల మధ్య పొలం పక్కన ఆగి ఉన్న ఎద్దుల బండిని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమయంలో మోటారు సైకిల్‌పై ఇదే గ్రామానికి చెందిన శివ కూడా ఉన్నప్పటికీ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఘటన స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటన స్థలికి చేరుకుని విచారణ చేపట్టిన అనంతరం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. జరిగిన ఘటనకు సంబంధించి మృతుడి తండ్రి తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మృతునికి తల్లి రేణమ్మతో పాటు సోదరుడు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



బొప్పల లక్ష్మన్న (ఫైల్)

గద్వాల, జూన్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని గోనుపాడు - పార్చర్ల స్టేజీల మధ్య గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని బొప్పల లక్ష్మన్న (66) అనే వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధరూర్ మండల కేంద్రానికి చెందిన బొప్పల లక్ష్మన్న గద్వాల నుంచి ధరూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై ఆయన కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు

మన్ననూరులో నిరుపయోగంగా ఈ హెల్త్, దయాగ్నోస్టిక్ కేంద్రం



మన్ననూరులో వృథాగా ఉన్న దయాగ్నోస్టిక్ కేంద్రం భవనం

మన్ననూర్, జూన్ 6 : లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్యకేంద్రం, దయాగ్నోస్టిక్ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన భవనం వృథాగా మారి నిరుపయోగంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన మారుమూల ఏజెన్సీ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆదివాసీ చెంచు గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వాలు సుమారు రూ.40లక్షలతో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం, వ్యాధినిర్ధారణ పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన భవనం ప్రారంభానికే పరిమితమయ్యాయి. గత 10ఏళ్ల క్రితం ఏజెన్సీ పరిధిలో గల మన్ననూరు, లింగాల పీహెచ్‌సీల్లో టెలీమెడిసిన్ సేవల నిమిత్తం ఈ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే కొంత మంది ఆరోగ్య సిబ్బందికి అంత ర్జాలంలో రోగికి అత్యవసర పరిస్థితిలో టెలీ మెడిసిన్ విధానంలో రోగికి ఎలా చికిత్స నిర్వహించాలి అనే విషయంపై శిక్షణ ఇచ్చారు. కానీ వాటికి కావాల్సిన సామగ్రిని సమకూర్చకుండా గాలికి వదిలేశారు. ప్రస్తుతం ఈ ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీలో ఉండే మందుల నిలువ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. కానీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులకు టెలీమెడిసిన్ సేవలు అందుబాటులో లేకుండా పోయింది. ఇదే క్రమంలో నల్లమల లోతట్టు ప్రాంతాల్లో ఉండే చెంచు గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, పసిరికలు, మధుమేహం, హిమోగ్లోబిన్, థైరాయిడ్ వంటి పరీక్షలను మన్ననూరులోనే నిర్వహించి వ్యాధినిర్ధారణ చేసేందు కోసం రూ.30 లక్షలతో డయాలసిస్ కేంద్రం కోసం భవన నిర్మాణాన్ని చేపట్టి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్ భవనాన్ని ప్రారంభించారు. పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ఏరియాల్లో డయాగ్నోస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించగా వాటిలో మన్ననూరు డయాగ్నోస్టిక్ సెంటర్ పేరు ఉంది. కానీ అధికారులు ఇట్టి కేంద్రానికి లాబొరేటరీ సామగ్రిని సమకూర్చకుండా, జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాల ఆసుపత్రిలోనే డయాగ్నోస్టిక్ కేంద్రం నిర్వహిస్తున్నారు. నల్లమల గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే దూరాభారం పెరిగింది. స్థానికంగా ఉండే ప్రైవేటు ల్యాబ్‌లలో డబ్బులు వెచ్చించి పరీక్షలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి నల్లమలలో మన్ననూరులోని ఈ ఆరోగ్య కేంద్రం, డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నల్లమల ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

ప్రైవేట్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటున్నాం



ప్రైవేటు ల్యాబ్‌ల్లో డబ్బులు వెచ్చించి పరీక్షలు చేయించుకుంటున్నాం. మన్న నూరులో మలేరియా, టైఫాయిడ్, షుగర్ వంటి టెస్టులు ప్రభుత్వ దవాఖానాలో ఈ టెస్టులు చేస్తే మాకు సౌకర్యంగా ఉంటుంది.

- తోకల ఈదమ్మ

అచ్చంపేటకు రెఫర్ చేస్తున్నారు..



తమకు అత్యవసర పరిస్థితుల్లో మన్ననూరు పీహెచ్‌సీకి వస్తే అంబులెన్సులో అచ్చంపేటకు రెఫర్ చేస్తున్నారు. ఇక్కడే వైద్య పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించాలి.

- నిమ్మల లింగయ్య, భౌరాపూర్ పెంట


స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

ఘనంగా కేవీకే స్థాపన స్వర్ణోత్సవాలు

బిజినేపల్లి, జూన్ 6 : కృషి విజ్ఞాన కేంద్రాలను స్థాపించి 50 వసంతాలు పూర్తి కావడంతో స్వర్ణోత్సవా లను ఘనంగా నిర్వహించినట్లు ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని ఆర్‌ఏ ఆర్‌ఎస్‌లోని ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన స్వర్ణోత్సవ సభలో ఆయన మాట్లాడారు. పాండి చ్చేరిలో 1974 మార్చి 21న దేశంలో మొదటి కృషి విజ్ఞాన కేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింద న్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసి మారుతున్న వ్యవసాయ రంగ విస్తరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్న తెలిపారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, కేవీకే, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పాగుంట వెంకన్న కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కేటీదొడ్డి, జూన్ 6 : అమావాస్య సందర్భంగా కేటీదొడ్డి మండలం, వెంకటాపురం సమీపంలో ని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురు వారం నిర్వహించిన కల్యాణోత్సవం వైభవంగా కొనసా గింది. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్ర హాలకు అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చకు లు, భక్తులు ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ మూ ర్తులను ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదికపై ఉంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేడుకను తిలకించడానికి తెలంగాణ, కర్ణాటక రా ష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమి టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమం లో శేషిరెడ్డి, గోపి, పద్మారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

వచ్చేనెల 3 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

» పాల్గొననున్న తెలంగాణ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు » ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 6 : మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం లో వచ్చేనెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మిం టన్ టోర్నీ నిర్వహించనున్నామని మహబూబ్‌నగ ర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేష న్ ఆధ్వర్యంలో మొదటిసారి రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వహణకు రాష్ట్ర సంఘం అవకాశం ఇచ్చిందన్నా రు. గతంలో జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం లేకపోవడం వల్ల రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వహించ లేకపోయామన్నారు. మాజీ క్రీడా శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ హయాంలో జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం జరిగిందన్నారు. అసో సియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వ హించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, 15 మంది ఆఫీషియల్స్ పా ల్గొంటారని తెలిపారు. మూడో తేదీన క్వాలిఫై యింగ్ రౌండ్, నాలుగు నుంచి ఆరో తేదీ వరకు డబుల్స్, సింగిల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయని వివరించారు. క్రీడాకారుల కు వసతి, భోజన సౌక ర్యం కల్పిస్తున్నట్లు తెలి పారు. టోర్నీ ప్రారంభోత్స వానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతిని ధి, రాష్ట్ర క్రీడా వ్యవహారా ల శాఖ సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ హాజ రుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగా ణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షు డు మహ్మద్‌హమెద్‌అలీ, జీ.శివప్రసాద్, ఎంపీ. ప్రవీణ్‌కుమార్, ఈసీ మెంబర్ సతీష్‌జోసెఫ్, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్ గౌడ్

ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు

» డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ఉండవల్లి, జూన్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని బైరాపురంలోని బీసీ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో, వీధుల్లో మోకాలిలోతు వర్షపు నీరు నిలుస్తోందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజాదర్బార్ లో చేసిన ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. గ్రామస్థులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి కన్నా దిగువన బీసీ కాలనీ ఉంది. కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో ప్రతీ వర్షాకాలంలో కాలనీలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను సమస్యను ప రిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో కాలనీకి చెందిన గురురాజ్ గత ఏడాది డిసెంబర్ 11న హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత వరుసగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకోలే దు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో ఎంపీవో పద్మావతి బీసీ కాలనీలో పర్యటించి, సమస్యను తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్డు ఎత్తు పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.


బైరాపురం బీసీ కాలనీలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎంపీవో

మా కాలనీకి సీసీ రోడ్డు వేయండి

» బురద నీటిలో కూర్చొని నిరసన


నాగర్‌కర్నూల్‌లోని 17వ వార్డులో బురద నీటిలో కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో గురువా రం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కాలనీలోని రాడ్లన్నీ జలమయమై చిత్తడిగా మారాయి. కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షానికి గోతుల్లో వ ర్షపు నీరు నిలిచిపోయి ద్విచక్ర వాహనదారులు సైతం రాకపోకలకు ఇబ్బంది గా మారింది. బీజేపీ బూత్ అధ్యక్షుడు బాలరాజు కాలనీవాసులతో కలిసి బురద నీటిలో కూర్చొని సీసీ రోడ్లు వేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి 17వ వార్డును దత్తత తీసుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేసి సీసీ రోడ్డు వేయకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చామని, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినా నేటికి ఆచరణలో పెట్టలేదని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులు స్పందిం చి కాలనీలో సీసీ రోడ్డు వేసి, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిం చాలని కోరారు. లేని పక్షంలో కాలనీవాసులతో కలిసి నిరాహార దీక్షకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

అడవి నుంచి వచ్చిన చుక్కల దుప్పి

» పట్టుకొని అటవీ శాఖ అధికారులకు అప్పగింత

అమ్రాబాద్, జూన్ 6: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే తిరుమలాపూర్ అటవీ ప్రాంతం నుంచి చెదిరి వచ్చిన ఒక చుక్కల దుప్పిని గ్రామస్థులు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించిన సంఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఒక చుక్కల దుప్పి చెదిరిపోయి గ్రామంలోకి రావడంతో ఊర కుక్కలు వెంబ డించాయి. దీంతో పరుగెత్తుకొంటూ వచ్చి ఊరు చివర ఉన్న ఓ ఇంటిదగ్గర నిలిచిపోయింది. వెంటనే గ్రామస్థులు స్థానిక అటవీ అధికారులకు సమాచా రం అందించారు. డీఆర్‌వో లక్ష్మీకాంత్, బీట్ ఆఫీసర్ గోపాల్ తదితరులు అక్కడికి చేరుకొని స్వల్పంగా గాయపడిన దుప్పికి ప్రథమ చికిత్స అందిం చారు. ఆ తర్వాత ఆరోగ్యంగానే ఉందని నిర్ధారించుకొని చుక్కల దుప్పిని ఆ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోనే వదిలి పెట్టినట్లు అమ్రాబాద్ ఆటవీ రెంజ్ అధికారి అదిత్య విలేకరులకు తెలిపారు.


బీకే తిరుమలాపూర్ గ్రామంలోకి వచ్చిన చుక్కల దుప్పి

చెరువులు, కుంటల్లోకి చేరిన వర్షపు నీరు


అమ్రాబాద్ సమీపంలోని లోకేశ్వరం చెరువులోకి చేరిన వర్షపు నీరు

అమ్రాబాద్, జూన్ 6 : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రా త్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షం కా రణంగా చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఈ ప్రాంతంలో చెదురు ముదురు వర్షాలు కురుస్తుండ డంతో రైతులు పత్తి, కంది, జొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో ఇటీవల కురిసిన వర్షానికి విత్తుకున్న రైతుల పత్తి విత్తనాలపై మట్టి పేరుకుపోయి మొలిచే అవకాశం లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట, జూన్ 6 : జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. గురువారం ఎస్పీ మాట్లాడుతూ వివాదాలు పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయని, ఒక వేళ ఇంతటితో కలిసి ఉంటామని ఒక నిర్ణయానికొస్తే సమిసిపోతాయన్నారు. ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలో వివిధ రకాల రాజీ పడదగు కేసులలోని కక్షిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట, కోస్గి కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. రాజీ కోసం కోర్టుకు హజరైతే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందన్నారు. రోడు ప్రమాదాలు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి, దొంగతనాలకు సంబంధించినవి రాజీ చేసుకోవచ్చు అన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో క్రీడాకారులు

నారాయణపేట, జూన్ 6 : వరంగల్ జిల్లా హన్మకొండలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి 10వ తెలంగాణ సీనియర్స్, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో జిల్లా క్రీడాకారులు 12 పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ గురువారం తెలిపారు. అండర్ 8 ఇయర్స్‌లో మహేష్ 150 మీటర్లు (సిల్వర్ మెడల్), వరుణ్ 50 మీటర్లలో (సిల్వర్ మెడల్), అండర్ 10 ఇయర్స్‌లో భరత్ లాంగ్ జంప్‌లో (గోల్డ్ మెడల్) మౌలాలి (సిల్వర్ మెడల్), పార్వతి (సిల్వర్ మెడల్), అండర్ 12 ఇయర్స్‌లో విష్ణు లాంగ్ జంప్‌లో (సిల్వర్ మెడల్), అండర్ 14 ఇయర్స్‌లో బసంత్ 400 మీటర్లలో (గోల్డ్ మెడల్) అండర్ 20 ఇయర్స్‌లో అరవింద్ 100 మీటర్లు మెన్ విభాగంలో, జనార్ధన్ హైజంప్‌లో (గోల్డ్ మెడల్), 110 మీటర్లు హడిల్స్‌లో (సిల్వర్ మెడల్) సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, వెంకటేశ్వర్ రెడ్డి, కోచ్ జగదీష్, శ్రీలత, రాజు అభినందించారు.

ప్రభుత్వ కాలేజీల్లోనే ఉజ్వల భవిష్యత్తు



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఐఈవో రియాజ్ హుస్సేన్

నారాయణపేట టౌన్, జూన్ 6 : ప్రభుత్వ కాలేజీల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రియాజ్ హుస్సేన్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను గురువారం పేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆవిష్కరించి, మాట్లాడారు. నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో అన్ని గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, సయిద్ అహ్మద్ తాజ్, కౌన్సిలర్ మహేష్, ఫయాజ్ ఖురేషీ పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

మక్తల్ రూరల్, జూన్ 6 : మక్తల్ పట్టణంలోని షిర్డి సాయి, మారెమ్మ ఆలయం, ఉమామహేశ్వరాలయం, కర్నీ గుంటిరంగ స్వామి ఆలయం, జక్లేర్ శివాలయం, రామసముద్రం బసవేశ్వరాలయం, మంథన్‌గోడ్ గ్రామ సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద గురువారం అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భజనలు, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధిరామయ్య స్వామి, రాజు, జయమ్మ, రాములు, డి.ఆంజనేయులు, సూర్య, చిన్న కృష్ణయ్య, అనంతకుమార్, నారాయణరెడ్డి, అంజయ్య ప్రవీణ్, అభిలాష్ పాల్గొన్నారు.

● నారాయణపేట న్యూటౌన్ : అమావాస్య సందర్భంగా గురువారం నారాయణపేటలోని పలు ఆలయాల్లో అన్నదానాలు కొనసాగాయి. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం చేశారు.

తూము మరమ్మతు చేపట్టాలి

ధన్వాడ, జూన్ 6 : ధన్వాడ మండల కేంద్రలోని పెద్దచెరువు తూము పూర్తిగా పాడైపోయిందని, ఈ విషయంలో అధికారులు స్పందించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రైతు సంఘం నాయకుడు ముసిరిగారి నర్సిములు పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో చెరువులో వర్షం నీరు వృథాగా పోతోందన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువును సందర్శించి, ఏ మరమ్మతు పనులు చేపట్టాలో పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. తూము పాడైపోవడంతో పొలాలకు నీళ్ల వదలాలంటే ఇబ్బందిగా మారుతోందన్నారు. అదే విధంగా చెరువు నుంచి పొలాలకు నీళ్ల వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాల్వలు సైతం సరిగ్గా లేవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

మద్దూర్, జూన్ 6 : విద్యుదాఘాతంతో ఓ లైన్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఖాజీపూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దామరగిద్ద మండలం కంసాన్‌పల్లికి చెందిన రఘు దామరగిద్ద సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మద్దూర్ సబ్‌స్టేషన్ నుంచి మొగుల్‌మడ్క వెళ్లే లైన్‌లో ఏర్పడ్డ సాంకతిక లోపాల్ని సరిచేసేందుకు స్తంభం ఎక్కగా, అర్తింగ్ వచ్చి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రఘును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

డీకే అరుణను కలిసిన నాయకులు

ఊట్కూర్, జూన్ 6 : మండల కేంద్రానికి చెందిన దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్ గోపాల్ మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ గెలుపొందడంతో గురువారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో గెలుపు సాధ్యమైందని, పార్టీ గెలుపునకు కృషి చేసిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కులు చెల్లించుకున్న బీజేపీ నాయకులు



కురుమూర్తి స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు

మరికల్, జూన్ 6 : మండలంలోని అప్పంపల్లి బీజేపీ మిత్ర మండలి బృందం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ విజయం సాధించడంతో కురుమూర్తి స్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు డోకూర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ డీకే అరుణ ఎంపీగా విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

● దామరగిద్ద : మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ గెలుపొందడంతో గురువారం ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీశ్యాంసుందర్ గౌడ్ దంపతులు కానుకూర్తి గ్రామంలోని నీలకంఠ స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. పేట నియోజకవర్గంలో బీజేపీ అధిక మెజార్టీ రావడం అభినందనీయమని తెలిపారు. కానుకూర్తి గ్రామ బీజేపీ నాయకులు కనికే శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్, శీలం ఈశ్వర్ రెడ్డి, దొడ్డి అంబదాస్, మోనేష్, అక్షయ్, కృష్ణ పాల్గొన్నారు.

● మక్తల్ రూరల్ : పార్లమెంటు ఎన్నికల్లో డీకే అరుణ విజయం సాధించడంతో తమ మొక్కు తీర్చుకునేందుకు శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద బీజేపీ నాయకులు 101 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో డీకే అరుణ విజయం సాధిస్తే కొబ్బరి కాయలు కొడతామని పడమటి అంజన్నకు మొక్కుకున్నట్లు తెలిపారు. అనుకున్న ప్రకారం డీకే అరుణ విజయం సాధించడంతో మొక్కు చెల్లించుకున్నామన్నారు. కార్యక్రమంలో చందాపూర్ మత్స్య సంఘం అధ్యక్షులు వెంక టేష్, బీజేపీ నాయకులు వాకిటి శ్రీనివాసులు, బ్రహ్మానందరెడ్డి, సందప్ప, నర్సిములు పాల్గొన్నారు.



బడిబాట కర పత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో అబ్దుల్ ఘనీ



మరికల్‌లో బడిబాట ర్యాలీ



పేగడబండ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

▸ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ▸ బడిబాట కార్యక్రమం ప్రారంభం



మక్తల్‌లో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ రూరల్, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందుతోందని ఎమ్మెల్యే వాటికి శ్రీహరి అన్నారు. జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం మక్తల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడంతో పాటు ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, నోటు బుక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, జీహెచ్‌ఎం అనిల్ గౌడ్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

● నారాయణపేట : ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని డీఈవో అబ్దుల్ ఘనీ పిలుపునిచ్చారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో నారాయణపేట ప్రభుత్వ లాల్ మజిద్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కర పత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయలతో చక్కటి బోధన అందిస్తారన్నారు. ప్రభుత్వం నుంచి రెండు జతల బట్టలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, భోజన వసతి, గుడ్లు అందిస్తారన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తఖీ చాంద్, ఏస్‌వో నాగర్జునరెడ్డి, సీఎంవో రాజేంద్రకుమార్, డీఎస్‌వో భాను ప్రకాష్, హెచ్‌ఎం జహీర్, ఉర్దూఘోరం అధ్యక్షుడు అమిరోద్దీన్, అబ్దుల్ గఫార్, ఎంపీ తారీక్‌చాంద్, ఫైజల్ అహ్మద్, ఖలీల్, సుల్తాన, భాను, నిజామోద్దీన్ పాల్గొన్నారు.

● మరికల్ : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా గాంధీ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో నమోదు చేయాలన్నారు. ఇందుకోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, మహిళా సమాఖ్య సభ్యులు, యువజన సంఘాలు కృషి చేయాలన్నారు.

● ఊట్కూర్ : విద్యాశాఖ ఆదేశాల మేరకు గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులతో కలిసి కర పత్రాలతో ప్రచారం చేశారు. నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యత, విద్యార్థుల చదువుపై హెచ్‌ఎం లక్ష్మారెడ్డి వివరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కోరారు.

● కృష్ణ : మండల కేంద్రంతో పాటు ఖాన్‌దొడ్డి, చేగుంట, మూడుమల్, తంగిడిగి, కుసుమూర్తి, గురుజాల, కున్సీ గ్రామాల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, సోమనాథరెడ్డి, శరణప్ప, అర్చన, శ్రీనివాస్, శేఖర్, రాజు, నాగరాజ్, సిద్దప్పగౌడ, సూర్యకాంత్, తాయప్ప, రేఖ పాల్గొన్నారు.

● మాగనూరు : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో వెంకటయ్య ఉపాధ్యాయులను కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక విద్యాధికారి కార్యాలయంలో ఎంఈవో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చేరేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం, స్కూల్ యూనిఫాంలు అందించడం జరుగుతుందని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అంతకుముందు పెగడబండ గ్రామంలో బడిబాట ర్యాలీని నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, ఏపీఎం వనిత కుమారి, సీఆర్పీ ఎల్లాగౌడ్, పాల్గొన్నారు.

● కోస్గి : ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బడిబయటి పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని మొదటి రోజు ప్రతిజ్ఞ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, పాఠశాల ఉపాధ్యాయులు బడి బయటి పిల్లలను బడిలో చేర్చి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

● ధన్వాడ: మండల కేంద్రంలోని సంత బజార్ పాఠశాలలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడిలో పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో హెచ్‌ఎం కెంచె బాలరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, రాణి తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో బడిబాట ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు



నిడుగుర్తి పాఠశాలలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



ధన్వాడలో బాడిబాట ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

▸ కలెక్టర్ కోయ శ్రీ హర్ష ▸ ఇంటింటికీ నల్లా కనెక్షన్‌పై అధికారులతో సమీక్షా సమావేశం

నారాయణపేట టౌన్, జూన్ 6 : మిషన్ భగీరథ పథకానికి సంబంధించి ఇంటింటికీ నల్లా కనెక్షన్ సర్వేను మిషన్ భగీరథ మొబైల్ యాప్‌లో వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హల్‌లో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎన్ని ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి? ఇంకా ఎన్ని కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఇళ్లు కట్టుకునే వాళ్లకు ఇవ్వాల్సిన కనెక్షన్‌లు ఎన్ని ఉన్నాయనే వివరాలతో కూడిన పూర్తి సమాచారంపై జిల్లా వ్యాప్తంగా సర్వే చేపట్టాలని సూచించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని సర్వేను పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ సర్వేకు నలుగురు మాస్టర్ ట్రైనర్లు అందుబాటులో ఉంటారని, మిషన్ భగీరథ ఇంజనీర్లు కూడా సర్వేలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిటట్టల్, డీపీవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

రైతులకు అందుబాటులో విత్తనాలు

▸ జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ ▸ ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



ఊట్కూర్‌లోని ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో



దామరగిద్దలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏవో

ఊట్కూర్, జూన్ 6 : జిల్లాలో రైతులందరికీ సరిపడా పత్తి, వరి, ఇతర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విత్తనాలు మరియు ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు, విక్రయ బిల్లులను, స్టాక్‌ను తనిఖీ చేశారు. ప్రతీ వస్తువు అమ్మకం, కొనుగోలు రికార్డును తప్పకుండా మెయింటెన్స్ చేయాలన్నారు. ఈ వర్షాకాలంలో కావల్సినని విత్తనాలు ఉన్నాయని, ప్రధానంగా రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రతీ షాప్‌లో విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైన రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినా లేదా అమ్మినట్లు ఫిర్యాదులు వచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు అమ్మాలన్నారు. మండలంలోని రైతులు స్థానికంగా ఉండే ఏఈవో సలహా తీసుకుని మంచి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

దామరగిద్ద : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంతో పాటు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల స్టాక్ రికార్డులను పరిశీలించారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. డీఏపీ కాంప్లెక్స్ ఎరువుల విక్రయానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఈ పాస్ మిషన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. లూజ్ విత్తనాలు విక్రయించరాదని హెచ్చరించారు.

ఉపాధి హామీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నారాయణపేట టౌన్, జూన్ 6 : జూన్ 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఉపాధి హామీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర సదస్సు పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధి హామీ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బాలప్ప, శివకుమార్, హన్మంతు, లాలప్ప, దేవప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కృష్ణ : ఉపాధి హామీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోని గూడెబల్లూరు గ్రామంలో ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సుకు మంత్రి సీతక్క, అఖిల భాతర కార్యదర్శి వెంకట్ హజరవుతారన్నారు. ఉపాధి హామీ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గుంజు తాయప్ప, బాదర్ మారెప్ప, పల్లె పార్వతమ్మ, రేణుక, సుజాత పాల్గొన్నారు.

మద్దూర్‌లో మోస్తరు వర్షం

మద్దూర్, జూన్ 6 : మద్దూర్‌లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. సంత జోరందుకున్న సమయంలో ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో వినియోగాదరులు, వ్యాపారస్థులు తడిచి ముద్దయ్యారు. కాగా వివిధ సామగ్రి వర్షానికి తడవడంతో వ్యాపారస్థులకు కొంత మేర నష్టం వాటిల్లింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు అరగంట పాటు కురిసన వర్షంతో ఉపశమనం పొందారు.

చిన్నారులకు పలకల పంపిణీ

మరికల్, జూన్ 6 : మండల కేంద్రంలో సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తొమ్మిదవ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు పలకలు, బలపాలు, పెన్నులు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేయడంతో పాటు నిరుపేద ఆడపడుచులకు పెళ్లి కానుకగా పుస్తె, మెట్టెలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో పోలెమోని రామకృష్ణ, రాఘవేందర్, జంగిడి శ్రీనివాసులు, రవికుమార్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఊట్కూర్, జూన్ 6 : మండల కేంద్రంలోని టైలరింగ్ సెంటర్‌లో గురువారం ఎస్‌బీఐ, వీబీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్ ఎస్‌కే చాంద్ సుల్తానా మాట్లాడుతూ ప్రతీ బ్యాంక్‌లో తక్కువ ప్రీమియంతో ప్రమాద, జీవిత బీమా ఇస్తున్నారన్నారు. ప్రతీ ఇంట్లో మహిళలు పొదుపు చేయడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చు అన్నారు. ఏ బ్యాంక్ కూడా మీ వ్యక్తి గత సమాచారాన్ని ఫోన్‌లో అడగదన్నారు. ల్యాటరీ పేరిట, లక్కీ డ్రా పేరిట ఎవరైన మీ వ్యక్తిగత సమాచారం అడిగినా, ఓటీపీలు అడిగినా చెప్పరాదన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన బీమా పథకాలు, అకౌంట్ లావాదేవీలతో పాటు సుకన్య సంవృద్ధి పథకం, జీవిత, ప్రమాద బీమా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నారాయణపేట, జూన్ 6 : జిల్లా వ్యాప్తంగా గురువారం పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరి పరీక్షలు కొనసాగాయి. రెండు కేంద్రాలను గాను 200 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 172 మంది విద్యార్థులు (86 శాతం) పరీక్షలకు హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. శ్రీసాయి స్కూల్‌లో 89 మంది విద్యార్థులకు గాను 80 విద్యార్థులు (90 శాతం) పరీక్షలకు హాజరు కాగా, తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో 111 మంది విద్యార్థులకు గాను, 92 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా , 88 శాతం హాజరు నమోదైంది. 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో అబ్దుల్ ఘనీ, జిల్లా పరీక్షల అధికారి శెట్టి రమేష్ తెలిపారు.

ఘనంగా శనేశ్వర జయంతి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నారాయణపేట న్యూ టౌన్, జూన్ 6 : నారాయణపేట బారంబావి దగ్గర శనేశ్వర అలయంలో గురువారం శనేశ్వర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శనేశ్వరుడి విగ్రహానికి తైలాభిషేకం నిర్వహించి, నల్లటి వస్త్రాలు సమర్పించారు.